
తేరగా సిరులొచ్చి
తెలివి తేటలు వచ్చి
పెరుగు పదవుల పిచ్చి
ఓ కూనలమ్మ :



కురులు దువ్వి విధాన
చెలుని దువ్వెడి చాన
నిజముగా నెరజాణ
ఓ కూనలమ్మ !

గద్య సుమములనుండి
కావ్య మధువులు పిండి
పంచి పెట్టెను దండి
ఓ కూనలమ్మ !

పాదరసమును గెలుచు
పడతి చపలత వలచు
గుండె లందున నిలుచు
ఓ కూనలమ్మ !



మూగ చూపుల సంజ్ఞ
మొదటి ప్రేమ కనుజ్ఞ
తెలుసుకొనుటే ప్రజ్ఞ
ఓ కూనలమ్మ !







# ఎర్రటేపు

## సోమంచియజ్ఞన్నశాస్త్రి

పరిపాలనా యంత్రంలో పదిమందీ ఆడిపోసుకుంటున్న అంశం, ఎర్రటేపు. ఈ ప్రపంచంలో ఎర్రటేపుని గురించి వున్న అపోహలు, విమర్శలు మరే విషయాన్నిగురించి లేవేమోనని నా అనుమానం. ఎవరిపని ఏకారణంచేత జరక్కపోయినా, లేదా అది ఆలస్యంగా, మజిలీలు చేసుకుంటూ జరిగినా, దానికంతా కారణం ఎర్రటేపేనని అక్కసు వెళ్ళబుచ్చడం పరిపాటి అయిపోయింది. నల్లేరుమీద బండిలా జోరుగా, ఎర్రటేపుమీద లేచిపోతారు. ఉప్పెన కెరటంలా విరుచుకుపడతారు. ఇంతమందిదృష్టి దానిమీద పడిందిగదా, నిజానికి దిష్టితగిలి క్షీణించవలసిందేనా? కాని అది మొండిఘటం. అందరి తిట్లూ, బెదిరింపులూ తుడిపేసుకుని బహుశా దీవెనలకింద దిద్దేసుకుని మరింత బలిష్ఠమై విశ్వవిహారం చేసేస్తూవుంటుంది. అదృశ్యశక్తులేవో దానికి హమేషా దిష్టి తీసి పారేస్తూ

కాపాడుతున్నారు కాబోలు. దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే నన్నట్టు ఎర్రటేపు సంస్కరణకి అందరూ నాయకులైపోయి సలహాలు విసిరిపారేస్తున్నారు. వానరరాజు వాలి సంగతి మీకందరికీ తెలిసిందేగా. ఎదటబడి ఎవడు యుద్ధంచెయ్యబోయినావాడిశక్తికూడా వాలికే సంక్రమించేది. అదేవిధంగా ఈ ఎర్రటేపు కూడా వొచ్చిన సలహాలన్నీ జీర్ణించేసుకుని, పూర్వం మేనాలో మెల్లిగా మెసిలేది. ఇప్పుడు కవాతుగుర్రమెక్కి సవారిచేస్తోంది.

నిజానికి కాశీమజిలీలో మాంత్రికుడిలాటిది యెర్రటేపు. మాంత్రికుడి ప్రాణం వాడి దగ్గర వుండదు. సప్తసముద్రాలూ దాటగా మధ్య ఓదీవిలో ఒంటిస్తంభం మేడమీద బంగారు పంజరంలోవున్న చిలకలోనో, గోరువంకలోనో వుంటుంది. బ్రహ్మరాక్షసులూ, భూతాలూ ఆ పక్షిని కాస్తూవుంటాయి. ప్రాణం ఎక్కడుందో కూపీతియ్యకుండా మాంత్రికుడిమీద పడి ఎన్నికత్తులు విసిరితేయేం, ఎన్ని ఫిరంగులు పేలిస్తేయేం? ఎర్రటేపు ఆ మాంత్రికుడికి పెద్దన్నగారు. కృశ్చెవ్, కెనెడీలు దాచిపెట్టిన ఆటంబాంబులన్నీ ఒక్కమాటు దానిమీద పడేసినా దానిపీచు విరగదు. అలాటి సందర్భంలో విషయం గ్రహించకుండా మన నాయకులు దాని సంహారానికి నడుంకట్టి, ఈటెలూ, బల్లాలూ ప్రయోగిస్తే ప్రయోజన మేముంది?

మొన్న ఓ మినిష్టరుగారికి చాలా కోపమొచ్చింది. ఆయన ఎక్కడికి వెళ్ళినా నెరవేరని వాగ్దానాలే యెత్తిచూపించడం ప్రారంభించారు ప్రజలు; అవన్నీ చేసెయ్యమని ఆయన అధికారులకే ఒక్కమాటుకాదు, అరడజనుమార్లు ఆర్డరు వేశారుట! ఎర్రటేపు పని జరక్కపోవడానికి కారణమంటూ అందరూకలిసి ఎర్రటేపుమీద విరుచుకుపడ్డారు. ఈ ఎర్రటేపంతా వెంటనే తీసిపారెయ్యవలసిందని ఆయన మరో ఆర్డరు వ్రాసేశారు. ఇది ఎలా తియ్యాలో ఆలోచించడానికి ఒక కాన్ఫరెన్సు ఏర్పాటు చేశారు. ఎర్రటేపువల్ల ఎన్ని అనర్థాలు వొస్తున్నాయో, ప్రభుత్వంపేరు, అందులో ముఖ్యంగా అయనపేరుఎలా చెడిపోతోందో ఆయన గంభీరోపన్యాసంలో విడమర్చి చెప్పారు. తరువాత ఉపకమిటీలు ఏర్పడి విషయాలన్నీ చర్చించాయి. చివరికి చెడ్డపేరు తెస్తున్న ఎర్రటేపంతా తీసిపారేసి, అన్ని ఆఫీసులలోనూ తెల్లటేపే ఉపయోగించాలని తీర్మానించారు. ఇది కేవలం భౌతిక దృష్టినించేగాక, భారతీయ సంస్కృతికి ఆధారమైన ఆధ్యాత్మిక దృష్టికి అనుగుణంగా వుంటుందని తీర్మానించారు. ఎర్రటేపు రజోభావాన్ని సూచిస్తుంది. తెల్లటేపు సాత్వికభావాన్ని సూచిస్తుంది. కనక టేపు బదలాయింపు, రాజకీయ, ఆర్థిక, పురోభివృద్ధిని సాధించడానికేగాక ఆధ్యాత్మికసాధనకికూడా దోహదమిస్తుందని మెచ్చుకుంటూ మినిష్టరుగారు అంత్యోపన్యాసం చేశారు.

అయితే బస్తాలకొద్దీ వున్న ఎర్రటేపుని ఏమిచెయ్యాలన్న ప్రశ్న వొచ్చింది. పూర్తిగా పారెయ్యమన్నారు కొందరు. చైనావాడి దుండగంవల్ల ఏర్పడిన అత్యవసర పరిస్థితిలో ఆ దుబారా పనికిరాదు కనుక ఆ టేపుకే తెల్లరంగు వేయించాలని మరొకరు సూచించారు. సిటీరంగా, నూనెరంగా అని మరికొంత తర్జనభర్జన. తీరా



దేశంలో జనాభా పెరిగినదానికంటె ఎక్కువగా ఆఫీసులో ఉద్యోగుల సంఖ్య పెరుగుతూండడం మామూలుగా జరుగుతున్నదే. దీనికి కారణం పని పెరగడమేనని మనలాంటి పామరు లనుకుంటారు. అదికాదుట. ఉద్యోగుల సంఖ్య పెరగడంవల్లనే పని పెరుగుతుందిట. ఈ విషయమై పార్కిన్‌సన్ అనే దొర ఆ మధ్య పరిశోధనలు జరిపి "రిలెటివిటీ" కంటె జటిలమైన ఒక సూత్రం కనిపెట్టాడు. "ఏ పనినైనా పూర్తిచేయడానికి లభించే కాలాన్నిబట్టి పని పెరుగుతుంది" అని. దీన్నే "పార్కిన్‌సన్స్ లా" అంటారు.

అలాగే, మన ప్రభుత్వ కార్యాలయాలలో ఎర్రటేపునుగురించి పరిశోధించి సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు ఈ వ్యాసం వ్రాశారు. సృష్టికి మూలకారణాన్నయినా కనుక్కోవచ్చు, గాని ఎర్రటేపు ఎవరిసృష్టి అనేది కనుక్కోలేమని ఆయన సూత్రీకరించారు. వీరు బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తుండడమేకాక, హాస్య రచయితగాకూడా ప్రసిద్ధికెక్కారు.

అది నిర్ధారణ చేసుకునేసరికి, ఆ రంగు కొనడానికి ప్రస్తుతం గ్రాంటులేదని తేలింది. తెల్లరంగు కొనడానికి అదనపుగ్రాంటు కావాలని మినిష్టరుగారు ప్రొపోజలుపెడితే ఫైనాన్సు డిపార్టుమెంటులో ఏ రూలుకింద యిది మంజూరు చెయ్యవచ్చునో ఆరాలు తీస్తున్నారు. ఈలోపుగా దాచిపెట్టిన ఎర్రటేపు ఎలుకలు తినివెయ్యకుండా కాపలావాళ్ళని పెట్టవలసొచ్చింది. ఎర్రటేపు రంగు ఫిరాయించుకుని తెల్లటేపుకింద ఎప్పుడో ఒకప్పుడు బయట పడవచ్చును, సందేహం లేదు. కాని ప్రస్తుతం ఆర్డరు అమలు జరగలేదని కోపగించుకోడానికి మరో అవకాశం లభించిందేతప్ప మరేమీ జరక్కుండాపోయింది. ప్రయోజనంవున్నా లేకపోయినా టేపురంగు ఫిరాయించడానికే యింత తతంగమయితే....

కనకనే ఎర్రటేపు విషయమై పరిశోధనచేసి, ఎర్రటేపు అంటే ఏమిటి? దాని స్వరూపం, స్వభావం, పరిణామం ఏమిటి అన్న విషయాలు, సూత్రాల్లోనూ, కథల్లోనూ చెప్పగలిగే పరిజ్ఞానం సంపాదించాను. నా పరిశోధనా ఫలితాలని సూత్రాలుగా అవగాహన చేసుకోడం మీకు కష్టం గనుక నేను మొత్తంమీద కథల్లోనే చెప్పవచ్చు. అంతా అర్థంచేసుకున్న తరవాత సప్త సముద్రాలూ దాటి, దాని ప్రాణం దాచిన కీలకాన్ని సంపాదించి సంహరించడానికి నడుం కడతారో, లేదా, నారాయణాస్త్రానికి నమస్కారమొక్కటే ప్రతిదానమయినట్టు దూరంనించే ఎర్రటేపుకి నమస్కరించి తప్పుకుంటారో మీ చేవనిబట్టి మీరే

నిర్ణయించుకోవాలి. జ్ఞానులు పో వెరిచే చోటికి మూర్ఖులు దూకుతారని ఓ ఇంగ్లీషు సామెత వుంది చూడండి.

ఎర్రటేపుకి ఆధారాలు రెండు. మొదటిది. రూల్సులేక రెగ్యులేషన్సు అనబడే నిబంధనావళి. రెండోది సంప్రదాయం.

ప్రతి ఆఫీసులోనూ, రూల్సూ రెగ్యులేషన్సూ నమిలి జీర్ణంచేసుకుని, ఈ నిబంధనల్లో ప్రాణం పోయి అవి పీనుగులయి పోయినా, వాటిని వొదిలిపెట్టక కంటికి రెప్పలా కాచుకుని వుండే కాసబియాంకాలు వుంటారు కొంతమంది. వాళ్ళ చేతిలో పుటుక్కున తెగిపోయే పురికొస పెట్టినా లంకాదహన మప్పుడు హనుమంతుడు తోకని పెంచినట్టు, మాంచి బలిష్టమైన నవారుపట్టీ నేసెయ్యగలరు. వాళ్ళు అల్లిన అల్లికని, సాలీడు గూడుకోసం అల్లుకున్న దారంలా పుటుక్కున తెంచి పారెయ్యగలమని ఎవరైనా అనుకుంటే, వాళ్ళు సావకాశంగా కూర్చుని అఘోరించవలసిందే తప్ప. యితరమేమీ జరగదు. పైగా అలాటి వాళ్ళకి లోకంలో అందరిమీదా అనుమానం. ప్రతిప్రపోజలులోనూ ఏదో అంతరార్థం వుండి తీరుతుందని వారికి గట్టి నమ్మకం. కనక ఏదో మడత పేచీ తగిలిస్తేనే గాని, వారిచేతిలో బడిన ఏ కాగితాన్ని కదల్చరు. విక్టోరియా మహారాణి కాలంలో జారీ చేసిన సర్క్యులర్లతోసహా అన్నీ వారికి కంఠగతం కావడంవల్ల ఏ ప్రపోజలులో ఎవరెవరు ఎక్కడెక్కడ ఏమేమి మరిచిపోయారో, తప్పు వ్రాశారో సునాయాసంగా వేలెత్తి చూపించగలరు. వారు వ్రాసిన నోటుకి సమాధానం చెప్పుకుంటే గాని కాగితం పైకి కదలడానికి వీల్లేదు. ఆ సమాధానం చెప్పుకోలేక గిజగిజ మంటూ ఎర్రటేపు మీద విరుచుకు పడతారు ప్రపోజలుపెట్టిన పెద్ద మనుష్యులు.

ఉదాహరణకి చూడండి. ఓ యింజనీరు గారు ఏదో అర్జెంటుగా ఓ ప్రాజెక్టు చేసెయ్యాలి. పంచవర్ష ప్రణాళికలో మూడో యేట ఈ పని పూర్తిచెయ్యాలని నిర్ణయం. ఈ నిమిషం, ఈ క్షణంనించే విశ్రమం లేకుండా శ్రమిస్తేనేగాని అది సాధ్యపడదు. కాని, పనికి ఉపక్రమించాలంటే కొన్ని పరికరాలు అత్యవసరంగా కావాలి. కొలుచుకునే టేపు అందులో ముఖ్యం. కనక మూడు మెటల్ టేపులు కొనడానికి శాంక్షన్ కావాలని ఇమీడియేట్ జెండా తగిలించి ఓ కాగితాన్ని ఫైలు రూపేణా పైకి పంపిస్తాడు. అది రిజిస్ట్రేషన్, డిస్పాచి అనే మజిలీలు దాటి గుమాస్తాగారిని చేరిన తరవాత వారు దాని విషయమై క్షుణ్ణంగా ఆలోచించి. మూడుపేజీల ప్రశ్నలు తయారు చేస్తారు.

ఆ ప్రాజెక్టు, డిటేల్డు ఎస్టిమేట్లు తయారయి అప్రోప్రియేటు అధారిటీల శాంక్షన్ పొందిందా? ఆ శాంక్షన్‌లో కొలతటేపులు ఇంక్లూడ్ అయివున్నాయా? ఇవి ఒకలైను ప్రశ్నలు. ఇంజనీరింగు డిపార్టుమెంటు లోగడ అనేక ప్రాజెక్టులు చేసింది. అప్పుడు చాలా టేపులు కొనివుండాలి. అవన్నీ ఏమయాయి? రాష్ట్రంలో అన్ని ప్రాజక్టులకీ, మీదగ్గర యేమన్నా ఖాళీగా టేపులు వున్నాయా? అవి మీరు ఎందుకివ్వలేరు? అని సర్క్యులర్లు పంపించారా లేదా? అలాటి సర్క్యులర్ పంపించి దానిఫలితం తేలినతరవాతనే ఏవస్తువయినా కొనాలని నిబంధన తెలియదా?

ఈ సందర్భంలో పంతొమ్మిదివందల పదిహేనులో జారీచేసిన ఆర్డరు ఇంకా అమలులోనే వుందిట - దానితరవాత మరో సంగ్రామం జరిగి దేశానికి స్వాతంత్ర్యమొచ్చినా.

ఇవి రెండోలైను ప్రశ్నలు.

ఒక ప్రాజెక్టుకి మూడు టేపు లెందుకు? ఈ టేపులు డ్రాయర్లలో వుండిపోకుండా హమేషా ఉపయోగించబడతాయని గ్యారంటీ యివ్వగలరా? టేపులు ఏవిధంగా ఎప్పుడు, ఎవరు ఉపయోగించేదీ, వివరమైన ప్రోగ్రాము తయారుచేసి పంపిస్తే పరిశీలించి, ఈ టేపులు కొనడానికి శాంక్షన్ ఇవ్వవచ్చునో, లేదో రిమార్కులు ఇవ్వబడును: ఇవి మూడోలైను ప్రశ్నలు.

ముందు వెనుకలు ఆలోచించకుండా ప్రొప్రోజలులు పెట్టి, కొలవడానికి టేపు లేక, ప్రాజెక్టులు పోస్టుపోను చేయించి, ఇంజనీర్లు ఎర్రటేపుని ఆడిపోసుకోడం న్యాయమా?




నిబంధనలు తిన్నగా తెలుసుకోని ఇంజనీర్లేకాదు. నిబంధనలుచేసే అధికార్లే ఒక్కొక్కప్పుడు బోల్తా కొట్టెయ్యవలసొస్తుంది. ఫైనాన్సు డిపార్టుమెంటు కార్యదర్శిగారి సెలవ జీతం సంగతి మీరు వినేవున్నారేమో. లేకపోతే క్లుప్తంగా చెబుతాను. అనగా అనగా, అంటే పూర్తిగా కట్టుకథ అనుకునేరు. కొంత అక్షరాలా నిజముంది—ఓ మాటు ఫైనాన్సు డిపార్టుమెంటు కార్యదర్శిగారు రెండు నెలలు సెలవమీద వెళ్ళారు. ఆయన ఏపూళ్ళోనూ

కాలు నిలవక, తిరుగుతూ వుండడంచేత నెలవరోజుల జీతం ఎక్కడికీ తెప్పించుకోలేకపోయాడు. తిరిగి డ్యూటీలో చేరిన తరవాత నెలవజీతానికి బిల్లు తయారుచేసి పంపించాడు. ఆయన నిబంధనలు అమలు జరిపించడంలో కాకలుతీరిన బంటు. ఆయన ఆధ్వర్యంకింద ఆ డిపార్టుమెంటులో యోధానయోధులు తయారయారు. ఒక మహా యోధుడి చేతిలో ఆయన బిల్లు పడింది. జీతం రాళ్ళకోసం ఎదురు చూస్తున్న ఫైనాన్సు డిపార్టుమెంటు కార్యదర్శిగారి నెత్తిమీద పిడుగు రాయిలా ఆ బిల్లు తిరుగు టపాలో తిరిగొచ్చింది.

"అయ్యా : ఇది మీరు నెలవలో వున్న నెల జీతానికి బిల్లు. పంచొమ్మిదో నిబంధన ప్రకారం శలవమీద వున్న జీతగాడు బతికి వున్నట్టు మేజస్ట్రేటునించి సర్టిఫికేట్ కూడా బిల్లుకి జతపరిచి వుండాలి. ఈ బిల్లులో తమరు కిందటినెలలో జీవించి వున్నట్టు సర్టిఫికేట్ లేదు. కనక జీతం ఇవ్వడానికి వీల్లేదు. సదరు సర్టిఫికేట్ జత చేయించి, బిల్లు తిరిగి సమర్పించుకుంటే జీతము ఇవ్వబడును" అని దానిమీద ఎండార్సుమెంటు. ఎవరైనా శలవమీద వుండి అక్కడ పరమపదించేసినా, వారిపేరు చెప్పి జీతం మరెవరో కొట్టేసెయ్యకుండా కాపాడుకునే నిమిత్తం ప్రభుత్వం ఈ షరతు పెట్టిందట. ఈ షరతు బతికే వుండి ఆఫీసులో తిరిగి చేరిన వారికి వర్తించదని కార్యదర్శిగారు వాదించి చూశారు గాని, ఈ వాదోపవాదాలతో కాగితం షటుల్‌కాక్‌లా తిరగడం ప్రారంభించేసరికి, తను క్రితం నెలలో బతికేవున్నట్టు సర్టిఫికేట్ సంపాదించి జీతం పుచ్చుకోడానికి తయారయాడు. ఫైనాన్సు డిపార్టుమెంటు కార్యదర్శి అయితే మాత్రం కిందటి నెలలో తను బతికున్నట్టు సర్టిఫికేట్ ద్వారా రుజువు చేసుకోకుండా, శలవజీతం వసూలు చేసుకుందామని ప్రయత్నిస్తాడా? రూలంటే రూలే !

ఇక ఎర్రటేపుకి రెండో ఆధారమయిన సంప్రదాయాన్ని గురించి క్లుప్తంగా చెబుతాను. మన జీవితాల్లో సంప్రదాయం ఎంత ప్రముఖపాత్ర వహిస్తుందో అందరికీ తెలిసిన విషయమే. మన పవిత్ర భారతదేశంలో ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క సంప్రదాయముంది. పెళ్ళిళ్ళలోనూ వియ్యాలవారి తగవుల్లోనూ సాధారణంగా యివి బయటపడుతూ వుంటాయి. కొత్తగా కాపురానికొచ్చిన పెళ్ళికూతురు ఏంచేసినా "ఇదేమిటోనమ్మా, ఇది మా సంప్రదాయం కాదు" అనాలనిపించడం పరిపాటే. ఒక వ్యక్తి అలవాటు, ఓ యింట్లో అలవాటుగానూ, కుటుంబానికి సంప్రదాయంగానూ పరిణమించవచ్చును. మాటవరసకి పళ్లు తోముకోకుండానే కాఫీ తాగడం. ఇప్పుడు కొన్ని కుటుంబాల్లో అదే సంప్రదాయ మయిపోయింది. కొంతకాలానికి వారింట్లో పుట్టినవారెవరైనా పళ్ళుతోముకుగాని కాఫీతాగము అని అంటే వారిని వెలివెయ్యొచ్చును కూడాను. అవకాశం దొరికింది కనక, ఈ ప్రిసిడెంటు ఆఫీసులో ఎలా విహరిస్తోందో వివరించక మునుపు, నిత్యజీవితంలో మనుష్యుల్ని ఎలా పట్టేసుకుంటోందో ఒక్క సంఘటన చెప్పాలనిపిస్తోంది. మా వూళ్లో ఓ అత్తరు సాయిబున్నాడు. మాతాతగారి హయామునించీ అతను మా యింటికి వొచ్చి కొంత అత్తరు, వాసననూనె ఇచ్చి వెళ్లేవాడు. మొన్నీమధ్య మావూరెళితే మళ్ళీ మా ఇంటిదగ్గిర కనిపించాడు. చాలాకాలానికి కనిపించాను గనుక వెంటనే ఆ వాసననూనె కొనాలని పట్టుపట్టాడు. "నన్ను చూస్తున్నావుగదా. మన శిరోజాలకి వాసననూనె వాడవలసిన అవసరం తీరిపోయి అప్పుడే కొన్ని సంవత్సరాలయింది." అంటే వినిపించుకోడే. 'అయ్యా మీ తాతయ్యగారికి ఇంతకంటె పెద్దబట్టతలే వుండేది. అది చాలా దర్జాఅయిన బట్టతల. నా వాసననూనెతో ఎప్పుడూ ఘుమఘుమలాడుతూ వుండేది' అని నామీద మా తాతయ్య ప్రిసిడెంటు విసిరాడు. ఏం చెయ్యను. బట్టతలకి సాయిబుగారి వాసననూనె కొనకతప్పింది కాదు.

కొంతమంది ఆఫీసర్లు ప్రిసిడెంటు చూపిస్తేగాని ఏమీ ఒప్పుకోరు - శకునం, వర్జ్యం చూస్తేనేగాని బయటకి కాలుపెట్టని మనుష్యుల్లాగ. శ్రావణ మంగళవారానికి శలవ మంజూరుచేసిన దొరవారిసంగతి మీకందరికీ తెలిసేవుంటుంది. శ్రావణ మంగళవారంనాడు శలవ ఇవ్వవలసిందని ఓ ఆఫీసులో గుమాస్తా పెట్టిన అర్జీమీద "కిందటి సంవత్సరం ఈ శలవయిచ్చారా ? ప్రిసిడెంటు ఏమిటి" అని దొరగారు అడిగితే "అయ్యా క్రితం సంవత్సరం శ్రావణ మంగళవారం ఆదివారంనాడు రావటంవల్ల శలవ శలవలో కలిసిపోయి, వేరే శలవ ఇవ్వలేదు" అని జవాబు యిచ్చారట. ఈ ప్రిసిడెంటుతో తృప్తిపడి ఆ దొరగారు వెంటనే శ్రావణ మంగళవారానికి శలవ




మంజూరుచేశారుట. ప్రిసిడెంటు చూస్తేనేగాని దేనినీ మంజూరుచెయ్యని ఆఫీసర్లకంటె గొప్పవారు - ప్రిసిడెంటు వుంటేనేగాని ఏపనీ చెయ్యడానికి వీలులేదని అడ్డు తగిలే గుమాస్తాలూ, యితర ఆఫీసు సిబ్బందీని.

ఈ మధ్య ఓ ఆఫీసులో పనిచేస్తున్న ఓ ప్యూన్ యింట్లో రాత్రి దొంగలుపడి, వాడు కట్టుకున్న, చిరిగిన పంచ, బనియను మినహా అన్నిగుడ్డలూ యెత్తుకుపోయారుట. బట్టలు కొనుక్కోడానికి ఓ నెలజీతం అడ్వాన్సుగా యిప్పించమని వాడు అర్జీపెట్టు

కున్నాడు. ఆఫీసరుగార్ని స్వయంగా దర్శించుకుని తను కట్టుకున్న బట్టకి వున్న చిరుగులన్నీ చూపించి మరీ ఆ అర్జీ ఆఫీసరుగారి చేతులో పెట్టాడు. ఆయన తప్పకుండా "విచారిస్తా"మని అర్జెంట్ రిమార్కులకోసం కాగితం కిందకి తోలారు. బట్టలు దొంగలు ఎత్తుకుపోతే, కొనుక్కునేందుకు అడ్వాన్సు యివ్వవచ్చునని స్పెసిఫిక్ రూలు యేమీలేదు కనక ప్రిసిడెంటు కావలసొచ్చింది. రూలేవుంటే ఆ రూలు లోగడ ఎప్పుడైనా ఉపయోగించబడిందా అని ప్రిసిడెంట్లు వెతకొచ్చును. అది వేరే సంగతి. ఆ ఆఫీసులో ఎవరింట్లోనూ దొంగలుపడి బట్టలుఅన్నీ ఎత్తుకుపోయినట్టు కాని, ఒకవేళ యెత్తుకుపోతే, ఫిర్యాదుచేసినట్టుగాని, నోటీవాకబుకి పైనం అందలేదు. కనక "మీ ఆఫీసుతో ఏ ప్యూను యింట్లోనయినా దొంగలుపడి బట్టలు అన్నీ యెత్తుకపోయారా? ఎత్తుకుపోతే యేంచేశారు." అని ఒక సర్క్యులర్ డ్రాఫ్టుచేసి ఆఫీసరుగారి సంతకం పుచ్చుకుని అన్ని శాఖలకీ పంపించారు. ఈ సర్క్యులర్ భావం తిన్నగా అర్థంకాలేదు. "ఎత్తుకుపోతే యేంచేశారు" అన్నదాని-కిబట్టలు దొంగిలించబడినప్యూన్ ఏమిచేశాడు అనా అర్థం? లేకపోతే ఆఫీసు ఏంచేసింది అనా? ఇది విడమర్చితేనేగాని సరిఅయిన జవాబు పంపించలేము అని ఒక శాఖనించి క్లారిఫికేషన్ కోరితే "ఆఫీసు ఏం చేసింది" అనే దీని భావం. అని మరో సర్క్యులర్ కూడా పంపించారు. వొచ్చిన సమాధానాలు క్రోడీకరించడానికి ఒక గుమాస్తాకి ఓవర్ టైము యిచ్చి పనిచేయించవలసి వొచ్చింది. ఫలితంగాతేలింది ప్యూనుల యిళ్ళల్లో·దొంగతనాలు జరిగి వస్తువులూ, బట్టలుకూడా పోగొట్టుకున్న సంఘటనలు వున్నాయిగాని, కట్టుకున్న చిరిగిన పంచె ఒక్కటీ మినహా బట్టలన్నీ ఎత్తుకుపోయిన దొంగతనం లోగడ ఎక్కడా జరగలేదు. ఏ ప్యూనూ అడ్వాన్సుకోసం దరఖాస్తుపెట్టుకున్నట్టులేదు. ఒకవేళ పెట్టుకున్నా అది రికార్డుల్లో కేవలం ఫైలయిపోయింది గాని మంజూరు చెయ్యబడలేదు." దాంతో వ్యవహారం మళ్ళీ ముందుకొచ్చింది. ఆరు వారాలుగా ఈ విచారణ జరుగుతోంది. రోజు విడిచి రోజు ఆ ప్యూను ఆఫీసరుగారికి చిరుగులు చూపిస్తున్నాడు. ఆఫీసరుగారి హృదయం దహిస్తూనేవుంది. తలకూడా తిరగడం ప్రారంభించేసరికి ఆయన హెడ్డుగుమాస్తాగారిని పిలిచి ఏలాగయినా ఈ ప్యూనుకి కొంతపారేసి వొదిలించుకోవాలని చెప్పవలసొచ్చింది. అందరూ తలలు గోక్కొని అత్యవసర (ఎమర్జన్సీ) నిబంధనలు తిరగేసి దీనికి అన్వయించడానికి వీలైన ఒక రూలు కనిపెట్టి. ఇది ప్రిసిడెంటుగా ఆ ప్యూను మరెప్పుడూ దొంగతనం జరిగించుకుని బట్టలన్నీ పోగొట్టుకుని జీతం అడ్వాన్సు అడగని షరతుమీద వాడి అర్జీ మంజూరుచేశారు. ప్రిసిడెంటు చూడకుండా అర్జీ మంజూరుచేసివుంటే అందరి యిళ్ళల్లోనూ దొంగతనాలు పెరిగిపోతాయని అందరికీ నమ్మకం. మరీ అవసరమొచ్చి ప్రిసిడెంటు లేకుండా ఏమన్నా చెయ్యవలసొస్తే, కాపాడుకోడానికి ఇది ప్రిసిడెంటు కాకూడదని ఒక షరతు జమాయించవలసొస్తుంది.

ఆఫీసు సిబ్బంది టైములో సహానికి పైగా ఈ ప్రిసిడెంట్లు వెతకడానికే సరిపోతుంది. ఎన్నెన్ని పాతఫైళ్ళు కిందికిదింపి దుమ్ము దులిపి పరిశీలించాలి! ఎంత సూక్ష్మపరీక్ష చెయ్యాలి. ఇదంతా ఏదో ఎర్రటేపు-పుటుక్కున తెంపెయ్యగలమనుకోడం ఎంత భ్రమ?

ప్రిసిడెంటు సోదరి "ఆఫీసు పద్ధతి." స్త్రీలింగం ప్రయోగించానని సోదరీమణులు కోపగించుకుంటారేమో. మొగాళ్లు కొంచెం మొరటు. అందంగా ఆభరణాలు—రెగ్యులేషన్ ప్రకారం పద్నాలుగు కారట్లవే లెండి—తగిలించడానికి అవకాశం లేదు. ఆఫీసు పద్ధతులు బహుసున్నితంగా, నాజూకుగా కూడా వుండగలవు కాబట్టి స్త్రీలింగం ప్రయోగించాను. మా ఆఫీసులో ఏదైనా కాగితం, ఒక సెక్షన్ నించి, మరో సెక్షన్‌కి వెళ్ళాలంటే—అంటే, ఎదురెదురుగా మూడడుగుల దూరంలో వున్న ఒక టేబుల్‌మీద నించి మరో టేబుల్‌మీదికి వెళ్ళాలంటే మొదట రిజిస్ట్రేషన్ సెక్షన్‌కి వెళ్ళి,అక్కడినించి డిస్పాచి సెక్షన్‌కివెళ్ళి, మళ్ళీ రిజిస్ట్రేషన్ సెక్షన్‌కి ప్రయాణించి గాని రెండో బల్లమీదికి రావడానికి వీల్లేదు. ఫైలు పట్టా తప్పితే యెంత ప్రమాదమో, ఈ పద్ధతి తప్పించి పక్క బల్లమీదికి ఫైలు దూకితే అంత ప్రమాదమూను. ఈ పరిస్థితిలో ఎంత పరుగెత్తినా కనీసం రెండు రోజులు పడుతుందిగదా, మూడడుగుల ప్రయాణానికీని. మినిస్టరుగారు సంతకం పెట్టినా ఆఫీసులో కాగితాలు కాళ్ళమీద నడిచే ప్యూనుద్వారా వెళ్ళాలిగాని. ఆకాశమార్గాన అందజెయ్యడానికి అవకాశం లేదుగా!

నిర్ణీతమయిన పని అందరికీ అప్పజెప్పడం ఆఫీసుపద్ధతిలో ఓ ప్రధాన భాగం కనక "ఇది నా పనిగాదు" అని గుమాస్తా మొదలు, ఆఫీసర్లదాకా చెప్పడం కూడా, ఆఫీసుపద్ధతిలో ఓ ప్రధాన భాగమే. కొన్ని కొన్ని అర్జీలు "ఇది మా శాఖకి సంబంధించినదికాదు" అన్న ఎండార్సుమెంటులతో ఆఫీసులు తిరుగుతూ వుంటాయి. ఎవరికి సంబంధించనిదో మటుకే తెలుస్తుంది కాని,ఎవరికి సంబంధించిందోఎవరికీ తెలీదు. కోపగించుకుని ఏం ప్రయోజనం? పోజిటివ్ దృక్పథంతో పనిచెయ్యాలని ఆఫీసు సిబ్బందికి ఉపన్యాసాలు దంచి ఏం లాభం? పరబ్రహ్మస్వరూపాన్ని గురించి కూడా "నేతి" "నేతి" అన్నారేగాని, "ఇతి" అని నిర్ధారణగా చెప్పలేకపోయారు కదా! మా ఆఫీసులో ఇంజనీర్లందరూ అకౌంట్ డిపార్టుమెంటూ, ఆడిట్ డిపార్టుమెంటూ తప్పులు పట్టడానికి నెగెటివ్ దృక్పథంతో పనిచేస్తారేగాని, పోజిటివ్ దృక్పథంతో సహాయం చెయ్యరని గోల. వేదాంతంచెప్పి ఓదార్చడం తప్ప నేనేం చెయ్యగలను చెప్పండి.

ఆశాజనకంగా లేదుకదూ? కనక నే మళ్ళీ ఓసారి ఆలోచించుకో మంటున్నాను. ఎర్రటేపు మీద ధ్వజమెత్తాలంటే దాని ప్రాణం ఎక్కడ భద్రపరచి వుంచబడిందో గ్రహించండి, అప్పుడు తేల్చుకోండి. సప్త సముద్రాలూ దాటి, దాని ప్రాణం దాచిన కీలకాన్ని సంపాదించి సంహరించడానికి సాహసిస్తారో, నమస్కారంపెట్టి కూర్చుండిపోతారో!